సంపుటి :02 సంచిక :258 పేజీలు :05

వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

శనివారం 20, డిసెంబర్ 2025



# 13 నుంచి ఐనవోలు జాతర

- భక్తుల సౌకర్యార్థం పటిష్ట ఏర్పాట్లు
- అధికారులు సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలి
- రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఐనవోలు జాతరపై ఎమ్మెల్యే, కలెక్టర్ తో కలిసి అధికారులతో సమీక్ష

05

## బీట్ బజార్..

# బెల్లం వార్

## లైసెన్స్‌డ్ వ్యాపారులు X అనధికార వ్యాపారులు

- మేడారం జాతర వేళ వ్యాపారుల మధ్య పోరు
- ఆ ప్రాంతంలో 9 లైసెన్స్‌డ్ బెల్లం షాపులు
- ఏడు షాపుల యాజమాన్యాల నిరంతర వ్యాపార లావాదేవీలు
- జాతర నేపథ్యంలో మిగతా రెండు షాపులూ అమ్మకాలు షురూ
- అలాగే ఇదే ప్రాంతంలో బెల్లం విక్రయాలకు అద్దెకు షట్టర్లు తీసుకున్న మరో వ్యాపారి
- తాజాగా రంగంలోకి ఉల్లిగడ్డలు, కొబ్బరికాయల వ్యాపారులు
- తీవ్రమైన అభ్యంతరాలు తెలుపుతున్న లైసెన్స్‌డ్ వ్యాపారులు



వరంగల్ లోని ప్రసిద్ధ పాత బీట్ బజార్‌లో మేడారం జాతర నేపథ్యంలో బెల్లం వ్యాపారం చిచ్చు రేపుతోంది. అనాదిగా బెల్లం విక్రయాలకు నిలయమైన ఈ ప్రాంతంలో, జాతర సీజన్‌లో జరిగే భారీ డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు కొత్త, పాత వ్యాపారుల మధ్య పోటీ మొదలైంది. నిబంధనల ప్రకారం వ్యాపారం చేస్తున్న లైసెన్స్‌డ్ వ్యాపారులు, అక్రమంగా రంగంలోకి దిగుతున్న ఇతర వ్యాపారులపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉల్లిగడ్డ, కొబ్బరికాయల వ్యాపారులు సైతం బెల్లం అమ్మ కాలకు ప్రయత్నాలు మొదలుపెట్టడం వివాదానికి దారితీస్తోంది. ఎక్సైజ్ అధికారులను మేనేజ్ చేస్తూ సాగిస్తున్న ఈ అక్రమ విక్రయాల వల్ల తమ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని లైసెన్స్ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

– అక్షరదర్బార్, వరంగల్

2

## పంచాయతీ ఫలితాలపై

# కాంగ్రెస్ పెద్దలు సీరియస్




- రాష్ట్రవ్యాప్తంగా 16 ఎమ్మెల్యేల పనితీరుపై సీఎం, పీసీసీ చీఫ్ ఆగ్రహం
- పార్టీకి తీవ్రమైన నష్టం జరిగిందంటూ మందలింపు
- రెబల్స్‌ను కట్టడి చేయడంలో వైఫల్యంపై పెదవి విరుపు
- ఉమ్మడి వరంగల్ లో నలుగురు ఎమ్మెల్యేలకు వార్నింగ్?

8

# ఫ్లెక్సీ రగడ

- ఎమ్మెల్యే కడియం వైఖరిపై గులాబీ శ్రేణుల గుస్సా
- పార్టీ ఫిరాయింపుపై ఎమ్మెల్యేది ద్వంద్వ వైఖరి అని ఆగ్రహం
- సాంకేతికంగా తాను బీఆర్ఎస్ లోనే ఉన్నానని స్పీకర్‌కు ఇటీవల ఎమ్మెల్యే వివరణ
- మరోవైపు ప్రభుత్వ కార్యక్రమాలు, కాంగ్రెస్ అధికారిక కార్యక్రమాలకు హాజరు
- మీడియా ప్రశ్నలకు దాటవేత సమాధానాలు
- ఎమ్మెల్యే వైఖరిని ఎండగట్టేందుకు గులాబీ శ్రేణుల వినూత్న నిరసన
- ఓ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఎమ్మెల్యే హాజరవ్వాల్సి ఉండగా ఫ్లెక్సీ ఏర్పాటు
- గులాబీ రంగులో ఫ్లెక్సీ.. దానిపై ఎమ్మెల్యే ఫొటో ఏర్పాటు
- స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉద్రిక్తత

5



www.aksharadarbar.com

అక్షర దర్బార్
Voice of the people



# బీట్ బజార్.. బెల్లం వార్

## లైసెన్స్ డ్ వ్యాపారులు X అనధికార వ్యాపారులు

- మేడారం జాతర వేళ వ్యాపారుల మధ్య పోరు
- ఆ ప్రాంతంలో 9 లైసెన్స్ డ్ బెల్లం షాపులు
- ఏడు షాపుల యాజమాన్యాల నిరంతర వ్యాపార లావాదేవీలు
- జాతర నేపథ్యంలో మిగతా రెండు షాపులూ అమ్మకాలు షురూ
- అలాగే ఇదే ప్రాంతంలో బెల్లం విక్రయాలకు అద్దెకు షట్టర్లు తీసుకున్న మరో వ్యాపారి
- తాజాగా రంగంలోకి ఉల్లిగడ్డలు, కొబ్బరికాయల వ్యాపారులు
- తీవ్రమైన అభ్యంతరాలు తెలుపుతున్న లైసెన్స్ డ్ వ్యాపారులు

**అక్షరదర్బార్, వరంగల్ :**

వరంగల్ జిల్లాకేంద్రంలోని పాత బీట్ బజార్ బెల్లం అమ్మకాలకు ప్రసిద్ధి. అనాదిగా ఆ ప్రాంతంలో బెల్లం అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఇక రెండేళ్లకు ఒకసారి మేడారం జాతర సమయం వచ్చిందంటే బెల్లం (బంగారం) అమ్మకాలు తారస్థాయిలో ఉంటాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సరఫరా అయ్యే హోల్‌సేల్, రిటైల్ బెల్లం అమ్మకాల్లో బీట్‌బజార్ వ్యాపారులే టాప్. జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు వెళ్తారు. వీరంతా నిలువెత్తు బంగారాన్ని తమ ఆరాధ్య దైవాలైన సమ్మక్క సారక్కకు సమర్పిస్తారు. వచ్చే నెల జనవరి 28 నుంచి 31 వరకు జాతర జరగనుండటంతో ప్రస్తుతం బీట్ బజార్‌లో బెల్లం అమ్మకాలు జోరందు కుంటున్నాయి. అయితే.. బెల్లం అమ్మకాల్లో వ్యాపార వర్గాల మధ్య ఓ వివాదం నడుస్తున్నది. ఈ ప్రాంతంలో మొత్తం తొమ్మిది షాపులకు జీఎస్టీ లైసెన్స్ ఉండగా, ఏడాదిన్నర క్రితం వీటిలో రెండు షాపులు మూతపడ్డాయి.


### - వివాదం ఎందుకంటే...

ఏడు షాపుల యాజమాన్యాలు మాత్రం ప్రభుత్వ నిబంధనల ప్రకారం జీఎస్టీ చెల్లించుకుంటూ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయి. స్థానిక ఎక్సైజ్ అధికారులకు ఐదు ఆరు రోజులకు ఒకసారి లెక్కలు అందజేస్తున్నాయి. మరో నెల రోజుల్లో మేడారం జాతర ప్రారంభం కానుండంతో ఏడాదిన్నర క్రితం మూతపడిన మిగతా రెండు షాపుల యాజమాన్యాలు కూడా దుకాణాలు తెరిచాయి. ఆ యాజమాన్యాలు కూడా బెల్లం విక్రయాలు ప్రారంభించాయి. ఈ రెండే కాకుండా ఇదే ప్రాంతంలో తాజాగా స్థానికేతర వ్యాపారి ఒకరు బెల్లం అమ్మకాల కోసం షెటర్లు అద్దెకు తీసుకొని సన్నాహాలు చేశారు. దీంతో అంతకముందు నుంచే కింద మీద పడుతూ వ్యాపారం కొనసాగిస్తున్న వ్యాపారులు తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తాము వ్యాపారానికి ఎక్కడా బ్రేక్ లేకుండా సాగిస్తున్నామని, కష్టనష్టాలు ఎదుర్కొంటూ మనుగడ సాగిస్తున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పటికే దుకాణాలు మూసేసిన వారే కాక, కొత్తగా మరికొందరు రంగంలోకి దిగి బెల్లం విక్రయించడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

– రంగంలోకి ఉల్లిగడ్డ, కొబ్బరికాయల వ్యాపారులు మేడారం జాతర సమీపిస్తున్న నేపథ్యంలో బీట్‌బజార్‌కు చెందిన ఉల్లిగడ్డ, కొబ్బరికాయల సిండికేట్ వ్యాపారులు కూడా బెల్లం అమ్మకాలు అమ్మేందుకు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే వీరంతా సిండికేట్ అయినప్పటికీ, వీరు ఇప్పుడు బెల్లం అమ్మకాల వైపు కూడా మళ్లుతున్నారు. ఈ సిండికేట్ల అధ్యక్షులు ఇప్పటికే బెల్లం అమ్మకాల కోసం తమకు అనుకూల వాతావరణం ఏర్పాటు చేసుకునే పనిలో తలమునకలయ్యారు. ఒక లారీ ద్వారా 20 టన్నుల బెల్లం వస్తుంది. ఒక్క మేడారం జాతర సమయం లోనే ఓల్డ్ బీట్ బజారుకు 90 లారీల ద్వారా బెల్లం వస్తుందని.. అంటే.. 1,800 టన్నుల మేర ఇక్కడ బెల్లం అమ్మకాలు జరుగుతాయని ఓ అంచనా. దీన్నిబట్టి బెల్లం వ్యాపారం ఎంత పెద్ద స్థాయిలో జరుగుతుందో ఊహించవచ్చు. ఈ డిమాండ్‌ను క్యాష్ చేసుకునేందుకు కొత్తవారు రంగంలోకి దిగడంతో బెల్లం అమ్మకాల్లో అంతకముందు నుంచే లైసెన్స్ ఉన్న షాపుల యాజమానులు మండిపడుతున్నారు. ఇప్పటికే షాపులు మూసేసిన ఇద్దరు యాజమానులతోపాటు మరో వ్యక్తి కూడా ఇదే ప్రాంతంలో షట్టర్ తెరిచి బెల్లం వ్యాపారం ప్రారంభించేందుకు సిద్ధం కావటం, ప్రధానంగా ఉల్లిగడ్డల వ్యాపారు కొందరు బెల్లం అమ్మకాలకు ప్రయత్నాలు చేపట్టడాన్ని ప్రశ్నిస్తున్నారు.

### - ఎక్సైజ్ శాఖను మేనేజ్

సాధారణంగా జీఎస్టీ లైసెన్స్ డ్ షాపుల్లో బెల్లం ఎంత స్టాక్ ఉందో, ఎంత అమ్ముడైందో తరచూ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ తనిఖీలు చేస్తుంది. సదరు వ్యాపారులు ఎప్పటికప్పుడు ఎక్సైజ్ శాఖకు సహకరిస్తూ నిబంధనల మేరకు బెల్లం విక్రయాలు నిర్వహిస్తున్నారు. అయితే.. కొత్తగా కొందరు బెల్లం విక్రయాలక తెరతీయడంతో ఆ షాపుల యజమానులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తమ వ్యాపారం అంతంతమాత్రం ఉందని, కొత్తగా వేరే వారు వచ్చి బెల్లం అమ్మితే తాము నష్టపోతామని వాపోతున్నారు. అయితే.. జీఎస్టీ లైసెన్స్ లేని వ్యాపారులు ఎక్సైజ్‌శాఖను మేనేజ్ చేసుకుని అక్రమంగా బెల్లం విక్రయాలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తుండటం చర్చనీయాంశమైంది.



# జాడ లేని మెడికల్ ఆఫీసర్ హాజరు మాత్రం 'బరాబర్'!

- ఆరు నెలలుగా ఇదే తంతు
- విధులు నిర్వహించకుండానే వేతనం డ్రా?
- రాయపర్తి పీహెచ్ సీలో నిర్లక్ష్యం జబ్బు
- చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

అక్షరదర్బార్, పరకాల : ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన వైద్య అధికారి విధులకు ఎగనామం పెడుతూ అధికారుల కళ్లుగప్పి ఆరు నెలలుగా వింత పోకడకు పాల్పడుతున్న ఘటన నడికూడ మండలంలో వెలుగుచూసింది. మండల పరిధిలోని రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్ గత ఆరు నెలలుగా విధులకు హాజరు కాకున్నా, హాజరు పట్టికలో మాత్రం ప్రతిరోజూ సంతకాలు పెడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పేద రోగులు చికిత్స కోసం ఆస్పత్రికి వస్తే డాక్టర్ దర్శనమే కరువవుతోందని వాపోతున్నారు.

### - పేద రోగుల అవస్థలు

రాయపర్తి పీహెచ్‌సీపై పరిసర గ్రామాల పేద ప్రజలు వందలాది మంది ఆధారపడుతున్నారు. అయితే మెడికల్ ఆఫీసర్ అందుబాటులో లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి రూ.వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో లభించాల్సిన వైద్య సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### - ఉన్నతాధికారుల తీరుపై..

మెడికల్ ఆఫీసర్ నిరంతరం విధులకు రాకపోయినా, హాజరు ఎలా నమోదవుతుందన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. ఈ వ్యవహారం నెల తరబడి సాగుతున్నా ఉన్నతాధికారులు ఎందుకు స్పందించలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### - ప్రజా సంఘాల ఆగ్రహం

ఈ ఘటనపై ప్రజా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. విధులకు హాజరు కాకుండానే ప్రభుత్వ ఖజానా నుంచి వేతనాలు పొందడం ఏంటని ప్రశ్నిస్తున్నాయి. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. లేనిచో ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నాయి.

## పంచాయతీ ఫలితాలపై

# కాంగ్రెస్ పెద్దలు సీరియస్

- రాష్ట్రవ్యాప్తంగా 16 ఎమ్మెల్యేల పనితీరుపై సీఎం, పీసీసీ చీఫ్ ఆగ్రహం
- పార్టీకి తీవ్రమైన నష్టం జరిగిందంటూ మందలింపు
- రెబల్స్ ను కట్టడి చేయడంలో వైఫల్యంపై పెదవి విరుపు
- ఉమ్మడి వరంగల్ లో నలుగురు ఎమ్మెల్యేలకు వార్నింగ్?

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణలో ఇటీవల ముగిసిన పంచాయతీ ఎన్నికల ఫలితాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి శనివారం సుదీర్ఘంగా సమీక్షించారు. పార్టీ అఖండ విజయం సాధించినప్పటికీ, కొన్ని నియోజకవర్గాల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడంపై నాయకత్వం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ముఖ్యంగా రెబల్ అభ్యర్థులను నియంత్రించడంలో విఫలమైన 16 మంది ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జిల తీరుపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ప్రయోజనాల కంటే సొంత బంధువులకు, అనుయాయులకు ప్రాధాన్యతనిచ్చి అధికారిక అభ్యర్థుల ఓటమికి కారణమయ్యారని అధిష్ఠానం గుర్తించింది. ఈ 16 మంది ఎమ్మెల్యేల జాబితాలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నట్లు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో బలమైన పట్టు ఉన్నప్పటికీ, సమన్వయ లోపంతో కీలకమైన పంచాయతీలను ప్రత్యర్థి పార్టీలకు కట్టబెట్టడంపై రేవంత్ రెడ్డి సదరు ఎమ్మెల్యేలపై మండిపడినట్లు తెలుస్తోంది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి, గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించడం వల్ల జిల్లాలో పార్టీకి తీరని నష్టం వాటిల్లిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. విఫలమైన ఎమ్మెల్యేలకు స్వయంగా ఫోన్ చేసిన మహేష్ కుమార్ గౌడ్, అధిష్ఠానం అసంతృప్తిని వారికి స్పష్టం చేశారు. కేవలం తమ వర్గానికే మేలు చేయాలనే ఆలోచనతో పార్టీ మనుగడను దెబ్బతీస్తే సహించేది లేదని హెచ్చరించారు. తక్షణమే తమ వైఖరి మార్చుకుని పార్టీ నిబంధనలకు లోబడి పని చేయాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు ఉంటాయని ఆదేశించారు. మేడారం జాతర వంటి కీలక సమయాల్లో జిల్లా నాయకత్వం ఐక్యంగా ఉండాలని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీ ప్రతిష్టను పణంగా పెట్టవద్దని స్పష్టం చేశారు.

# డిజిటల్ చెల్లింపులకు కియోస్క్

## - టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి




అక్షరదర్బార్, హనుమకొండ: ప్రపంచం మొత్తం డిజిటలైజేషన్ గా మారుతున్న తరుణంలో ప్రతి ఒక్క వినియోగదారుడు తమ నెల వారి కరెంట్ బిల్లులను ఆన్ లైన్ లో చెల్లించాలని టీజీఎన్పీడీసీ ఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి కోరారు . శనివారం హన్మకొండ నక్కలగుట్టలోని విద్యుత్ బిల్లుల చెల్లింపు కార్యాలయంలో యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఏర్పాటు చేసిన 'డిజిటల్ పేమెంట్ కియోస్క్' ను సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ముఖ్య అతిధిగా విచ్చేసి అధికారికంగా ఆరంభించారు. ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ వినియోగదారులకు నగదు రహిత చెల్లింపు చేసేలా 'డిజిటల్ పేమెంట్ కియోస్క్' ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఇక్కడకు వచ్చిన వినియోగదారులు ఆన్ లైన్ లో చెల్లించే విధంగా చూసేలా ఉద్యోగిని నియమించాలని చెప్పారు. అలా ఆన్ లైన్ లో చెల్లించే విధంగా చెల్లింపు చేయడం వల్ల మరుసటి సారి వినియోగదారుడు ఆన్ లైన్ ద్వారా తన నెల వారి విద్యుత్ బిల్లులు చెల్లింపు చేయడం వల్ల ప్రతి ఒక్కరు ఆన్ లైన్ కు మొగ్గు చూపుతారని అన్నారు. వినియోగదారులు ఇక్కడ అందుబాటులో ఉంచిన కియోస్క్ ద్వారా తక్కువ సమయంలో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని పేర్కొన్నారు. కియోస్క్ లో సంబంధిత విద్యుత్ బిల్లుపైన ఉన్న యూనిక్ సర్వీస్ నంబర్ నమోదు చేస్తే సంబంధిత వివరాలు కనిపిస్తాయని, అందులో పేమెంట్ ఆప్షన్ కు వెళ్ళగానే క్యూఆర్ కోడ్ వస్తుందని, వినియోగదారుని మొబైల్ లో యూపీఐ యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి బిల్లు చెల్లించవచ్చని అన్నారు. ఇది చాల సులభం, సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఇకపై నగదు తీసుకురావాల్సిన అవసరం లేదని, చిల్లర సమస్యలు, కౌంటర్ రద్దీ, వేచి ఉండే సమస్యలు పూర్తిగా తగ్గిపోతాయని తెలిపారు. యూనియన్ బ్యాంకు మద్దతుతో ఉద్యోగులకు రూ.కోటి బీమా అందిస్తున్నామని చెప్పారు . సాంకేతికతను అందిపుచ్చుకొని వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఫైనాన్స్ వి తిరుపతిరెడ్డి, సీజీఎం ఆర్ చరణ్ దాస్, జీఎం శ్రీనివాస్, వెంకటకృష్ణ , జయరాజ్, హన్మకొండ ఎస్ఏఓ నవీన్ కుమార్, డీఈ టెక్నికల్ విజయేందర్ రెడ్డి, హన్మకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి, యూనియన్ బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ జోనల్ హెడ్ యం రవీంద్ర బాబు, డీజీఎం రీజినల్ హెడ్ గంటి కమలాకర్, వై శ్రీకాంత్ కుమార్, ఏజీఎం, కార్పొరేట్ బిజినెస్ సెంటర్ హైదరాబాద్, డిప్యూటీ రెజినల్ హెడ్ మహేష్ , మేనేజర్ నక్కలగుట్ట కుందన్ కుమార్, రవి కుమార్ తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

# యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవాలి

## మొగుళ్లపల్లి మండల ఏవో సురేందర్ రెడ్డి



అక్షరదర్బార్, మొగుళ్ళపల్లి : రైతన్నలు యూరియాను సులభంగా, పొందేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ ద్వారా యూరియా బుకింగ్ యాప్ ప్రారంభిస్తున్నట్లు మొగుళ్లపల్లి మండల వ్యవసాయ అధికారి సురేందర్ రెడ్డి తెలిపారు.ఈ యాప్ ద్వారా రైతులు స్వయంగా లేదా ఇతరుల సహాయంతో యూరియా బుక్ చేసుకోవచ్చు. పట్టాపాస్ బుక్కు లింక్ అయిన మొబైల్ నెంబర్కు వచ్చే ఓటిపి ఆధారంగా బుకింగ్ పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారి సురేందర్ శనివారం మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక భవన్ ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన రైతులకు అవగాహన కల్పించారు బుక్ చేసిన యూరియాను 24 గంటల్లోగా లేదా మరుసటి రోజు రాత్రి వరకు తీసుకోవాల్సి ఉంటుంది. భూమి విస్తీర్ణం, పంటల ఆధారంగా యూరియా బస్తాల సంఖ్య నిర్ణయించబడుతుంది. పట్టాపాస్ బుక్ రైతులు, ఆర్వో ఎఫ్ ఆర్, అసైన్డు, కౌలు రైతులకు కూడా ఈ యాప్ ద్వారా యూరియా అందించబడుతుందని తెలిపారు.భూమి విస్తీర్ణాన్ని అనుసరించి 15 రోజుల వ్యవధిలో విడతల వారీగా యూరియా బుకింగ్ విధానం అమలు చేస్తామని, రైతులు ఈ యాప్ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలు రైతులు పాల్గొన్నారు,



# కరాటేలో గీతాంజలి విద్యార్థుల ప్రతిభ



నర్సంపేట, అక్షర దర్బార్: సుమన్ షాటోకాన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఇండియా నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో గీతాంజలి పాఠశాల విద్యార్థులు పి. సమన్విత, పి. సాత్విక్ ప్రథమ బహుమతులు సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. విద్యార్థుల విజయంపై గీతాంజలి విద్యా సంస్థల చైర్మన్ డా. వేములపల్లి సుబ్బారావు అభినందనలు తెలిపారు. కష్టం, పట్టుదలతోనే విజయం సాధ్యమని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ఎన్. రాజేష్ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటడం ఆదర్శమని ప్రశంసించారు. విద్యార్థుల విజయం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

# సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి



అక్షర దర్బార్, కేసముద్రం: డిసెంబర్ 26న నిర్వహించనున్న సిపిఐ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సిపిఐ మండల కన్వీనర్ చొప్పరి శేఖర్, మండల నాయకులు మంద భాస్కర్ పిలుపునిచ్చారు. కేసముద్రం మండలం కోరుకొండపల్లిలో నిర్వహించిన గ్రామ శాఖ సమావేశంలో వారు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య పోరాటం, కార్మిక–రైతు హక్కుల సాధనలో సిపిఐ కీలక పాత్ర పోషించిందన్నారు. డిసెంబర్ 26న మండల కేంద్రంలో జరిగే భారీ ర్యాలీలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు పూజారి రవి, చొప్పరి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్ష




అక్షర దర్బార్, చిట్యాల/ నల్లబెల్లి : శ్రీనివాస రామానుజన్ జన్మదిన వేడుకల సందర్భంగా చిట్యాల మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీరామ్ రఘుపతి, మండల గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు ఎస్. రామ్ నారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షలో కే. సంజన ప్రథమ స్థానం, కే. తేజ కుమార్ ద్వితీయ స్థానం, జే. సౌమిత్ తృతీయ స్థానం సాధించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంజిత్, లక్ష్మీపతి, కోటేష్, మమత, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

### నల్లబెల్లిలో..

నల్లబెల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ మాథ్స్ ఫోరం నల్లబెల్లి శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి మాథ్స్ టాలెంట్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో మేడపల్లి పాఠశాల విద్యార్థులు తిరుపతి, అభిరామ్, నల్లబెల్లి పాఠశాల విద్యార్థి ప్రణవ్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు పద్మజ, అనిల్, నటరాజ్, శృతి తదితరులు పాల్గొన్నారు.

# నైన్ పాక పాఠశాలలో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండలం నైన్పాక గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఆర్. ఊర్మిళ అధ్యక్షతన తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. కమ్యూనిటీ మొబిలైజర్ ఆఫీసర్ ఎస్. రమేష్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పి. విజయపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులు స్వయంగా తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డిసిఇబి అసిస్టెంట్ సెక్రటరీ చల్ల కిషన్ రెడ్డి సీనియర్ ఉపాధ్యాయులు సుధాకర్ ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు ప్రణీత, ప్రవీణ్ కుమార్, రాజయ్య, రఘు, ప్రసాద్ కోటేశ్వరరావు, లోక శ్రీనివాస్, విజయవర్ధన్ రెడ్డి, ఓదెలు, సిఆర్పి తిరుపతి మరియు విద్యార్థులు పాల్గొన్నారు



# విద్యార్థుల పొలంబాట

నర్సంపేట, అక్షర దర్బార్: ప్రపంచ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని గీతాంజలి ప్రైమరీ పాఠశాల విద్యార్థులు మాదన్నపేట, నాగుర్లపల్లి గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. విద్యార్థులు కూరగాయలు, మిర్చి తదితర పంటలను పరిశీలించి సాగు విధానాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. పంట చేనుల్లో తిరుగుతూ, ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లపై ప్రయాణం చేసి చిన్నారులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమం ద్వారా విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించడమే లక్ష్యమని గీతాంజలి విద్యా సంస్థల చైర్మన్ డా. వేములపల్లి సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ మిధున్, గుడిపాటి సౌజన్యతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హుస్సేన్ పల్లి అభివృద్ధికి కృషి చేస్తా

## ఎమ్మెల్యే జీఎస్సార్ కలిసిన సర్పంచ్ ఎడ్ల స్వరూప సుధాకర్ రావు

అక్షర దర్బార్ శాయంపేట: హుస్సేన్ పల్లి గ్రామాభివృద్ధికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో నిరంతరం పని చేస్తానని శాయంపేట మండలం హుస్సేన్ పల్లి గ్రామ సర్పంచ్ ఎడ్ల స్వరూప – సుధాకర్ రావు అన్నారు.హన్మకొండలో ఎమ్మెల్యే ను గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులతో కలిశారు.ఈ సందర్భంగా సర్పంచ్ కు ఎమ్మెల్యే శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ గా మమ్ములను గెలిపించినందుకు ప్రజలందరికీ రుణపడి ఉంటానన్నారు.గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి,ఉపసర్పంచ్ నాగుల గాని లక్ష్మణరావు, లాడే రాజు కుమార్,గుండెకారి రాజేందర్ వార్డు సభ్యులు పాల్గొన్నారు.



# 22న నూతన సర్పంచుల బాధ్యతల స్వీకరణ

అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి: మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 22న నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నట్లు మొగుళ్ళపల్లి ఎంపీడీవో సురేందర్ గౌడ్ తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ మేరకు, గత రెండేళ్లుగా గ్రామ స్పెషల్ ఆఫీసర్ల పాలనలో కొనసాగిన గ్రామ పరిపాలనకు ముగింపు పలుకుతూ, ఇప్పటివరకు విధులు నిర్వహించిన స్పెషల్ ఆఫీసర్లు నూతన సర్పంచులకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులతో కలిసి గ్రామస్థాయి తొలి సమావేశాన్ని నిర్వహించి, నూతన గ్రామ పంచాయతీ పాలనకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. మొగుళ్ళపల్లి మండల పరిధిలోని 26 గ్రామ పంచాయతీల్లో నూతన సర్పంచులు ఈ నెల 22న అధికారికంగా బాధ్యతలు చేపట్టనున్నట్లు ఎంపీడీవో వివరించారు.



# భూపాలపల్లిలో నూతన కోర్టులు ప్రారంభం

అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు నూతనంగా మంజూరైన రెండు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ శనివారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెండింగ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వేగవంతమైన న్యాయ పరిష్కారాల కోసం కొత్త కోర్టుల ఏర్పాటు అవసరమైందన్నారు. న్యాయ శాఖ ఉద్యోగుల శారీరక, మానసిక ఆరోగ్యం బాగుంటేనే వారు విధులను సమర్థవంతంగా నిర్వహించగలరని పేర్కొంటూ, మూడు జిల్లాల న్యాయ శాఖ ఉద్యోగుల కోసం స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ సమీపంలో ఏర్పాటు చేసిన కోర్టు భవనాలను, అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన క్రీడా కార్యక్రమాలను వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు ఈ.వి. వేణుగోపాల్ (మూడు జిల్లాల అడ్మినిస్ట్రేటివ్ జడ్జి), నామవరపు రాజేశ్వర్ రావు, బి.ఆర్. మధుసూదన్ రావు పాల్గొన్నారు. అలాగే జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్. రమేష్ బాబు, ములుగు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.వి.పి. సూర్య చంద్రకళ, మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మొహమ్మద్ అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.



# నూతన సర్పంచ్ కి సన్మానం

అక్షర దర్బార్, చిట్యాల: ఇటీవల చిట్యాల మండల కేంద్రంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో నూతనంగా గ్రామ సర్పంచిగా ఎన్నికైన తౌటం లక్ష్మి అంతయ్యను అయ్యప్ప స్వాములు ఘనంగా సన్మానించారు. శనివారం చిట్యాల గ్రామంలో సీనియర్ గురు స్వామి సాధా సదానందం ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు తాటిపల్లి శ్రీనివాస్, చిలుకల తిరుపతి, మణికుమార్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్య కళ్యాణ మహోత్సవం

అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి పట్టణంలోని సుభాష్ కాలనీలో గల శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సనాతన ధర్మ పరిరక్షణకు, సమాజంలో శాంతి, ఐక్యత పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. దివ్య కళ్యాణ మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు.





# రోడ్డు భద్రత సామాజిక బాధ్యత

- రోడ్డు భద్రత నియమాలు అందరూ పాటించాలి
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు-2026పై వీసీ ద్వారా సమీక్ష

అక్షరదర్బార్, ములుగు: రోడ్డు భద్రత సామాజిక బాధ్యత అని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు– 2026పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రవాణా, ఆర్అండ్ బీ శాఖ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, లా అండ్ ఆర్డర్ ఏడీజీ మహేష్ ఎం భగవత్, జాతీయ రహదారుల, ఆర్టీసీ, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం శనివారం నిర్వహించగా, జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఓఎస్డీ శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ సంపత్ రావులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వ



హించేవారని, గత ఏడాది నుంచి మాసోత్సవాలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో గత ఏడాది 7,949 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారని పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలపై ఈ నెల ఆఖరులోగా జిల్లా స్థాయిలో రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించాలని, కార్యక్రమం నిర్వహణపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. నేషనల్ హైవే, ఆర్అండ్ బీ, పీఆర్, పోలీస్, రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా జిల్లాలోని బ్లాక్ స్పాట్లను గుర్తించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భద్రత మాసోత్సవాలపై విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ సీసీ, ఎన్ఎస్ఎస్, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని, నెల రోజులపాటు ట్రాఫిక్ వాలంటీర్లను నియమించాలని సూచించారు. రోడ్డు ప్రమాద బాధితులకు దగ్గరలోని ఆసుపత్రిలో వైద్యం అందించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిందని, రోడ్డు ప్రమాద బాధితుల వైద్యానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన వారికి పారితోషికం ఇస్తుందని చెప్పారు.

అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులతో మాట్లాడుతూ, జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లాలో రహదారి భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహించుటకు, ఆయా విద్య సంస్థల్లో విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ ఇతర పోటీలు నిర్వహించుటకు, నేషనల్ హైవే, ఆర్అండ్ బీ, పీఆర్, పోలీస్, రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి, ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వీసీలో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, డీఈఓ సిద్ధార్థరెడ్డి, నేషనల్ హైవే డీఈ కుమార స్వామి, పీఆర్ ఈఈ అజయ్ కుమార్, ఆర్అండ్ బీ ఈఈ శ్యామ్ సింగ్, మున్సిపల్ కమిషనర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త సర్పంచ్ లకు ఎమ్మెల్యే జీఎస్సార్ సన్మానం

అక్షర దర్బార్, భూపాలపల్లి : గ్రామాల అభివృద్ధికి సర్పంచులు ఐక్యంగా పనిచేసి ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం తొలి దశ విజయవంతంగా పూర్తయిందని, రెండో దశ త్వరలో ప్రారంభమవుతుందని చెప్పారు. అంతకుముందు సర్పంచులు ఎమ్మెల్యేకు పూల బొకేలు అందజేశారు. ఎమ్మెల్యే కూడా నూతన ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించారు. అలాగే ఎన్నికల్లో ఓటమి చెందిన నాయకులు నిరుత్సాహ పడకుండా రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.



# యూరియా బుకింగ్ యాప్ ప్రారంభం

**పరకాల మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్**



అక్షరదర్బార్, పరకాల: రైతులకు యూరియాను సులభంగా, పారదర్శకంగా అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి యూరియా బుకింగ్ యాప్ ప్రారంభిస్తున్నట్లు పరకాల మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తెలిపారు.ఈ యాప్ ద్వారా రైతులు స్వయంగా లేదా ఇతరుల సహాయంతో యూరియా బుక్ చేసుకోవచ్చు. పట్టాపాస్ బుక్కు లింక్ అయిన మొబైల్ నెంబర్‌కు వచ్చే ఓటిపి ఆధారంగా బుకింగ్ పూర్తి చేయాలని పరకాల మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ కోరారు. ఆయన మాట్లాడుతూ సమీప అధీకృత ఎరువుల డీలర్‌ను ఎంపిక చేసుకుని యూరియా బుక్ చేసుకోవచ్చు. భూమి విస్తీర్ణం, పంటల ఆధారంగా యూరియా బస్తాల సంఖ్య నిర్ణయించబడుతుంది. పట్టాపాస్ బుక్ రైతులు, ఆర్వో ఎఫ్ ఆర్, అసైన్డ్, కౌలు రైతులకు కూడా ఈ యాప్ ద్వారా యూరియా అందించబడుతుందని తెలిపారు.భూమి విస్తీర్ణాన్ని అనుసరించి 15 రోజుల వ్యవధిలో విడతల వారీగా యూరియా బుకింగ్ విధానం అమలు చేస్తామని, రైతులు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


# 13 నుంచి ఐనవోలు జాతర

- అధికారులు సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలి
- మంత్రి కొండా సురేఖ



అక్షరదర్బార్, హనుమకొండ:ఐనవోలు శ్రీ మల్లికార్జునస్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు.జనవరి 13 నుంచి ప్రారంభం కానున్న జాతర ఏర్పాట్లపై హనుమకొండ కలెక్టరేట్‌లో మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తుల కోసం తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్, పార్కింగ్, భద్రత, ఆర్టీసీ బస్సులు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతర ప్రాంగణంలో 108 వాహనాలు, క్యాష్‌లెస్ వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని చెప్పారు.వీఐపీ దర్శనం వల్ల సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సూచించారు. అన్ని శాఖల సహకారంతో జాతరను విజయవంతంగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో డీసీపీ అంకిత్ కుమార్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఆలయ కమిటీ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఫ్లెక్సీ రగడ



- ఎమ్మెల్యే కడియం వైఖరిపై గులాబీ శ్రేణుల గుస్సా
- పార్టీ ఫిరాయింపుపై ఎమ్మెల్యేది ద్వంద్వ వైఖరి అని ఆగ్రహం
- సాంకేతికంగా తాను బీఆర్ఎస్ లోనే ఉన్నానని స్పీకర్‌కు ఇటీవల ఎమ్మెల్యే వివరణ
- మరోవైపు ప్రభుత్వ కార్యక్రమాలు, కాంగ్రెస్ అధికారిక కార్యక్రమాలకు హాజరు
- మీడియా ప్రశ్నలకు దాటవేత సమాధానాలు
- ఎమ్మెల్యే వైఖరిని ఎండగట్టేందుకు గులాబీ శ్రేణుల వినూత్న నిరసన
- ఓ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఎమ్మెల్యే హాజరవ్వాల్సి ఉండగా ఫ్లెక్సీ ఏర్పాటు
- గులాబీ రంగులో ఫ్లెక్సీ.. దానిపై ఎమ్మెల్యే ఫొటో ఏర్పాటు
- స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉద్రిక్తత

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి
స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి లక్ష్యంగా శనివారం బీఆర్ఎస్ శ్రేణులు చేపట్టిన ఫ్లెక్సీ నిరసన ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన కడియం శ్రీహరి, ఆ తర్వాత మారిన రాజకీయ సమీకరణాలతో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. తర్వాత తన కుమార్తెకు కాంగ్రెస్ ఎంపీ టికెట్ తీసుకున్నారని, ఆమె గెలుపు కోసం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పనిచేశారని, అనేక పార్టీ ప్రచార కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారనే బీఆర్ ఎస్ శ్రేణులు అప్పట్లో అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ అంశంపై బీఆర్ఎస్ నాయకత్వం న్యాయపోరాటం చేస్తున్నది. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలో న్యాయస్థానం ఆదేశాల మేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎమ్మెల్యేల వివరణ కోరగా, తాజా విచారణలో ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని, వారు గెలిచిన పార్టీలోనే ఉన్నారని స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. స్పీకర్ మిగిలిన ఎమ్మెల్యేల సంగతి కూడా తేల్చాల్సి ఉంది. ఈ జాబితాలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా ఉన్నారు.

### - కడియం దాటవేత సమాధానం

మీడియా ప్రతినిధులు ఇటీవల ఓ కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మీరు ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారు.. అని ప్రశ్నించగా, ఎమ్మెల్యే నేను ఏ పార్టీలో ఉండాలో.. అదే పార్టీలోనే ఉన్నాను అంటూ దాటవేసేలా సమాధానమిచ్చారు. అంతేకాకుండా, తాను కాంగ్రెస్ పార్టీలో చేరలేదని, బీఆర్ఎస్ సభ్యత్వాన్ని కూడా రద్దు చేసుకోలేదని ఆయన స్పీకర్‌కు లిఖితపూర్వక వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూనే, మరోవైపు సాంకేతికంగా బీఆర్ఎస్‌లోనే ఉన్నానని చెప్పుకోవడంపై గులాబీ శ్రేణులు మండిపడుతున్నాయి.

### - గులాబీ శ్రేణుల వినూత్న నిరసన

ఎమ్మెల్యే కడియం శ్రీహరి ద్వంద్వ వైఖరిని ఎండగట్టేందుకు బీఆర్ఎస్ నాయకులు వినూత్న నిరసనకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా శనివారం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో నిర్వహించిన తిరుమలనాథ స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారానికి విచ్చేస్తున్న ఎమ్మెల్యే కడియంకు స్వాగతం పలుకుతూ బీఆర్ఎస్ కార్యకర్తలు భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. మా బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి స్వాగతం అంటూ ఆ ఫ్లెక్సీలలో పేర్కొనడం చర్చనీయాంశమైంది. కడియం తన రాజకీయ పంథాను మార్చుకుంటే ప్రజల మధ్యకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే రావాలని, లేనిపక్షంలో అనైతిక రాజకీయాలు మానుకోవాలని వారు డిమాండ్ చేశారు. సదరు ఫ్లెక్సీల్లో మాజీ ఎమ్మెల్యే , బీఆర్ ఎస్ నేత తాడికొండ రాజయ్య చిత్రం కూడా ఉండటం గమనార్హం.

### - ఉద్రిక్తత..

గులాబీ శ్రేణులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల కారణంగా నియోజకవర్గంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మున్సిపల్ సిబ్బంది, పోలీసులు కలిసి ఆ ఫ్లెక్సీలను తొలగించే ప్రయత్నం చేయగా, బీఆర్ఎస్ నాయకులు అడ్డుకున్నారు. ఒక దశలో రెండు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్వయంగా తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని చెబుతున్నప్పుడు, ఆయనకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు కడితే పోలీసులు ఎందుకు తొలగిస్తున్నారని వారు ప్రశ్నించారు. ఈ క్రమంలో జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారితీయడంతో పోలీసులు పలువురు బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఫ్లెక్సీ వివాదం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో ఘన్‌పూర్ రాజకీయం మరింత వేడెక్కింది.



# గంగిరేనిగూడెం ఉపసర్పంచ్ గా బానోత్ సుమన్

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం గంగిరేనిగూడెం గ్రామ ఉపసర్పంచ్ గా బానోత్ సుమన్ శనివారం ఎన్నికయ్యారు.గ్రామపంచాయతీ కార్యాలయంలో మండల అధికారి వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించి ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించారు.ఈ ఎన్నికలో సుమన్ కు మెజారిటీ ఉండటం వలన ఉపసర్పంచిగా ఎన్నికైనట్లు అధికారులు వెల్లడించారు.ఈ సందర్బంగా సుమన్ మాట్లాడుతూ తనను ఉప సర్పంచ్ గా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని తెలియజేశారు.




# జిల్లాస్థాయి గణిత పోటీలకు జూకల్ విద్యార్థి ఎంపిక

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలంలోని చూకల్లో గ్రామంలో గల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి గణిత ప్రతిభాపాటవ పరీక్షల్లో జూకల్ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి జంబుల సౌమిత్ తృతీయ స్థానం పొంది జిల్లాస్థాయికి ఎంపిక అయినట్లు ప్రధానోపాధ్యాయులు శనివారం తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో కూడా విద్యార్థి మరింత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని వారు ఆకాంక్షించారు. జూకల్ పాఠశాల విద్యార్థి జిల్లాస్థాయికి ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



# బాధిత రైతును ఆదుకోవాలి

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండలం ఎలేటి రామయ్యపల్లి గ్రామానికి చెందిన రైతు పల్లవేని రమేష్ అగ్ని ప్రమాదంలో పత్తి, ఎరువులు, ధాన్యం బస్తాలు దగ్ధమై సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లిందని, బాధిత రైతును ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు. బాధిత రైతును పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇలాంటి ఘటనల్లో రైతులను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కంచ కుమారస్వామి, రాజేందర్, కేంసారపు ప్రభాకర్ పాల్గొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915